మీ వద్దకే..మీ ఎస్పీ



చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించి మాట్లాడుతున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

చింతపల్లి, న్యూస్‌టుడే: గ్రామస్థాయిలోని బాధితులకు సత్వర న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో 'మీట్ యువర్ ఎస్పీ' కార్యక్రమాన్ని నిర్వహించారు.

■ బాధితులు ఇచ్చే ఫిర్యాదులను స్వీకరించి జాప్యం లేకుండా చర్యలు తీసుకొని న్యాయం చేయాలన్నారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో పోలీసులు మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. మారుమూల ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చి ఫిర్యాదు చేసేందుకు ప్రజలు పడుతున్న ఇబ్బందులను తీర్చేందుకే ఇక్కడికి వచ్చి స్వీకరిస్తున్నామన్నారు. జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

■ అనంతరం మార్కెట్ యార్డులో నిర్మిస్తున్న పోలీస్‌స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించారు. దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, సీఐ నాంపల్లి నవీన్‌కుమార్, ఎస్సై యాదయ్యతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

■ మండల కేంద్రంలోని శ్రీషిర్డీ సాయి బాబా దేవాయలంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. గోశాల ఇన్‌ఛార్జి పుల్లారెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, తదితరులున్నారు.

అవగాహన కల్పించాలి: డీఎంహెచ్‌వో

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో గ్రామీణ ప్రాంత ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవన్‌లో శుక్రవారం మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు ఇతర సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడటంతో పాటు ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. సమయపాలన పాటించని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, ప్రోగ్రామ్ అధికారులు కల్యాణ్ చక్రవర్తి, కృష్ణకుమారి, అరుంధతి, గీతావాణి, దుర్గయ్య పాల్గొన్నారు.

వంటపాత్రలు వచ్చేస్తున్నాయ్..!

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే:

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. ఇందుకు స్థానికంగా మహిళా సంఘం సభ్యులను నియమించడమే కాకుండా వారికి గౌరవ భృతి సైతం అందిస్తోంది. అప్పట్లో దశల వారీగా వంటగదులను సైతం నిర్మించారు. అంతా బాగానే ఉన్నా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభమైనప్పుడు అందించిన వంటపాత్రలతోనే ఏజెన్సీలు ఇప్పటి వరకు వినియోగిస్తున్నారు. కాలం చెల్లిన పాత్రలతో వంటలు రుచికరంగా ఉండకపోవడంతో పాటు ఇబ్బందులు పడుతున్నామని వంట ఏజెన్సీ మహిళలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పెద్దగా ఫలితం లేకుండా పోయింది. వంట ఏజెన్సీల డిమాండ్ల నేపథ్యంలో ఈ విషయాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం తాజాగా వంటపాత్రల కొనుగోళ్లకు నిధులు మంజూరు చేసింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఆయా పాఠశాలల్లో పథకం నిర్వహణకు వంటపాత్రలకు ప్రభుత్వం రూ.2.60 కోట్లు వెచ్చించింది.



రాజపేటలోని ఓ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్నభోజనం వడ్డిస్తున్న ఏజెన్సీ (పాతచిత్రం)

అందించనున్న పాత్రలు ఇవీ..

తెల్ల అన్నం వండే గిన్నెలు, ఇంగ్రీడియంట్స్ కోసం స్టీలు కంటైనర్లు, వండిన వాటిని వడ్డించేందుకు స్టీలు బకెట్లు, అన్నం వడ్డించే కఫ్గీర్ (స్థానికంగా చెయ్యి అంటారు), కూరలు వడ్డించేందుకు గంటెలు తదితరాలను ప్రతి బడికి అందించనున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాత్రలను అందించేందుకు జిల్లా విద్యాశాఖకు నిధులు మంజూరు చేసింది. కొద్ది రోజుల్లోనే సరఫరాకు బహిరంగ టెండర్లు పిలువనున్నారు. జిల్లా స్థాయిలో వంటపాత్రల సరఫరాకు అన్ని రకాల అర్హతలున్న పంపిణీదారుల నుంచి టెండర్లు ఆహ్వానించి పాత్రల కొనుగోలు బాధ్యతలు అప్పగిస్తారు. తాజాగా ప్రభుత్వ పరంగా వంటపాత్రల కోసం నిధులు మంజూరు చేయడంతో వంట ఏజెన్సీలు, విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వివరాలు.. (రూ.లల్లో)

జిల్లా	నిధుల మంజూరు
నల్గొండ	1,18,10,000
సూర్యాపేట	77,90,000
యాదాద్రి	64,80,000

సన్నాలకు ససేమిరా..!



హుజూర్‌నగర్, హుజూర్‌నగర్ గ్రామీణం, కోదాడ, న్యూస్‌టుడే:

మరో వారం రోజుల్లో మార్కెట్‌లోకి ధాన్యం ఇబ్బడి ముబ్బడిగా రానుంది. మిల్లర్లు మాత్రం సన్నరకాల ధాన్యం మిల్లింగ్ చేసే విషయంపై పట్టు వీడలేదు. ప్రభుత్వం వారి డిమాండ్లపై ఇంకా కొలిక్కి రాలేదు. సబ్‌కమిటీ ఒక నిర్ణయం తీసుకుని సీఎంకు నివేదిక ఇచ్చినట్లు సమాచారం. క్యాబినెట్ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. ఒక్కసారిగా ధాన్యం మార్కెట్‌లోకి వస్తే సన్న రకాలను ఎక్కడికి పంపుతారన్న విషయంపై స్పష్టత లేదు. ధాన్యం నేరుగా మిల్లులకు కేటాయించకుండా కొనుగోలు కేంద్రాల నుంచి గోదాములకు తరలించాలని నిర్ణయం తీసుకున్నప్పటికీ ఖర్చులు పెరుగుతాయన్న దానిపై తర్జన భర్జన పడుతున్నారు. ఇతర భారాలు నెత్తికి ఎత్తుకోకుండా మిల్లర్లకే ఇవ్వాలన్న ఆలోచనకు వచ్చినట్లు సమాచారం.




హుజూర్‌నగర్ సమీపంలో కోతకు సిద్ధంగా సన్నరకం వరి

పెరగనున్న అవసరాలు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,83,560 మెట్రిక్ టన్నుల సన్న రకాల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేస్తున్నారు. దొడ్డు రకాల ధాన్యం 10,69,029 మెట్రిక్ టన్నులు వస్తుందని అంచనా. ప్రభుత్వం సన్న రకాల ధాన్యం తీసుకుని పౌరసరఫరాల అవసరాలకు వాడుకోవాలని చూస్తోంది. జనవరి నుంచి పేదలకు రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందుకు సన్న రకాల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సన్నరకాల ధాన్యం పండించిన రైతుకు రూ.500 బోనస్ కూడా ప్రకటించింది. ఇప్పటి వరకు సన్న రకాల ధాన్యాన్ని మిల్లులకు పంపించాలా, గోదాములలో ఉంచాలా అనే నిర్ణయం కోసం ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాక అంచనా (మెట్రిక్ టన్నుల్లో)



★ సన్నధాన్యం మిల్లింగ్ చేసినప్పుడు దొడ్డు రకాలకు వచ్చినట్లు 67 కిలోల బియ్యం రావని, 57 కిలోలు మాత్రమే వస్తాయని మిల్లర్లు అంటున్నారు. ప్రభుత్వం మాత్రం దొడ్డు రకమైనా, సన్న రకమైనా క్వింటాకు 67 కిలోల బియ్యం ఇవ్వాలంటుంది. తేమ శాతంతో సన్న రకాల ధాన్యం దిగుమతి చేసుకుంటే నెల రోజుల్లోపే రంగు మారిపోతుందని మిల్లర్లు చెబుతున్నారు. అందుకు తేమ శాతాన్ని 14 శాతానికి మార్చాలంటున్నారు. మిల్లింగ్ ఛార్జీలు, ధాన్యం నిల్వ చేసిన ఛార్జీలు పెంచాలని పట్టుబడుతున్నారు.

కొనుగోళ్లకు సర్వం సిద్ధం

ధాన్యాన్ని రెండు రకాలుగా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కేంద్రాలు ఏర్పాటు చేసింది. దొడ్డు రకాలు ఒక కేంద్రంలో, సన్న రకం మరో కేంద్రంలో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. సన్నరకాలను గుర్తించేందుకు ప్రత్యేక సాంకేతిక పద్ధతులను అవలంబించనున్నారు.



ఉమ్మడి జిల్లాలో అక్టోబరు **2,22,711** నవంబరు **6,58,334** డిసెంబరు **5,17,814** జనవరిలో **1,21,363** మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టుకి నీటి విడుదల



మోటార్ ద్వారా నీటిని విడుదల చేస్తున్న చిత్రం

నార్కట్‌పల్లి గ్రామీణం న్యూస్‌టుడే: నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లంల వద్ద నిర్మించిన ప్రాజెక్టులోకి అధికారులు అకస్మాత్తుగా శుక్రవారం పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసే కార్యక్రమం ప్రారంభించారు. రెండు మోటార్లు ఉండగా.. ఒక మోటార్ ద్వారా నీటిని విడుదల చేశారు. రైతులకు సాగునీటికి ఇబ్బందులు లేకుండా భూగర్భ జలాలు పెంచేందుకు నీటిని విడుదల చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. రోజుకు 10 గంటల చొప్పున ఐదు రోజుల పాటు చెరువును 50 శాతం మేర నింపుతున్నట్లు తెలిపారు. తద్వారా ప్రాజెక్ట్ సమీపంలోని సుమారు 9 కిలో మీటర్ల వరకు భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. వచ్చే యాసంగి సీజన్లో రైతులకు నీటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు.

రంగుమారిన భగీరథ నీరు



మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడెంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం మిషన్ భగీరథ నల్లా నీరు ఎరుపు రంగులో రాగా కాలనీ వాసులు బెంబేలెత్తిపోయారు. స్థానికంగా పలు వీధుల్లో వచ్చిన నల్లాల్లోని నీటిని పట్టుకున్న స్థానికులు ఎరుపు రంగులో ఉండి మట్టివాసనలు వస్తుండగా ఇబ్బంది పడ్డారు. కొద్దిరోజులుగా నల్లానీరు ఇదే రంగులో వస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సిబ్బందిని పంపి పరిశీలిస్తామని ఇబ్బందులు లేకుండా చూస్తామని కమిషనర్ యూసుఫ్ తెలిపారు.

– న్యూస్‌టుడే, మిర్యాలగూడ

యంత్రాల కొరతతో ఎన్ని కష్టాలో..!

■ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టిసారిస్తేనే సరి

'రాష్ట్రంలోనే అత్యధికంగా మూత్రపిండాల వ్యాధిగ్రస్థులు జిల్లాలో ఉన్నట్లు ఇటీవల వైద్యఆరోగ్యశాఖ నిర్వహించిన సర్వేలో తేలిందని అధికారులు చెబుతున్నారు. అధిక రక్తపోటు, చక్కెర వ్యాధి అదుపులో లేకపోవడం, పొగ, మద్యం అధికంగా తాగడం, ఫ్లోరిన్ నీరు, ఆహార నియమం పాటించకపోవడం, జంకు ఫుడ్ వినియోగం, సరైన శారీరక వ్యాయామం లేకపోవడం వంటి కారణాలతో మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడటం, ఇన్‌ఫెక్షన్లు రావడం జరుగుతుంది. వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే రక్తశుద్ధి చేయాల్సి వస్తుందని.. కొన్నిసార్లు ప్రాణాలు కోల్పోవడం కూడా జరుగుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలోని ఒక్క ప్రభుత్వ ఆసుపత్రిలో నెఫ్రాలజిస్టు లేకపోవడంతో పాటు డయాలసిస్ బాధితులకు సరైన వసతులు, యంత్రాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు.

– నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే:'



నల్గొండ జనరల్ ఆసుపత్రిలో రక్తశుద్ధి చేయించుకుంటున్న బాధితులు

గడిచిన మూడేళ్లలో చికిత్స పొందిన వారి వివరాలు

ఏడాది	బాధితులు	రూ.కోట్లల్లో
2022	3,252	7.42
2023	3,855	6.21
2024 ఆగస్టు	2,890	4.55

నల్గొండలో 36 మంది అదనం..

నల్గొండ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ మంది మూత్రపిండాల సమస్యలతో బాధపడుతున్నారు. జనరల్ ఆసుపత్రిలో ఉన్న డయాలసిస్ (రక్తశుద్ధి) కేంద్రంలో నిత్యం 36 మంది వెయిటింగ్ లిస్టులో పేర్లు నమోదు చేసుకుని ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఉన్న యంత్రాలతో పాటు మరో పది నూతన యంత్రాలు తక్షణం అవసరం ఉందని వైద్యాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న పది యంత్రాలతో 110 మంది బాధితులకు రక్తశుద్ధి నిర్వహిస్తున్నారు.

■ ఉదయం సమయం సరిపోకపోవడంతో రాత్రి 10 గంటలకు బాధితులు కేంద్రానికి వస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు రాత్రి పూట మొత్తం ఇక్కడ పడుకుని మరుసటి రోజు వెళ్తున్నారు. ఇలా వారంలో రెండు సార్లు వచ్చే వారు 29 మంది ఉన్నారు. బాధితుల సమస్యలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. అరుణకుమారిని వివరణ కోసం శుక్రవారం చరవాణి ద్వారా పలుమార్లు ప్రయత్నించగా స్పందించలేదు.



రాత్రిపూట రావాల్సి వస్తోంది: – వేముల రవి, అక్కలాయిగూడెం

రక్తశుద్ధి కోసం వచ్చిన ప్రతిసారి నాలుగు గంటలు మంచం పైనే ఉండాలి. బాధితులకు తగినన్ని యంత్రాలు లేని కారణంగా రాత్రి సమయంలోను రావాల్సి వస్తోంది. మరికొన్ని యంత్రాలను ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.



వైద్యులు లేరు: – ముత్యాల వెంకట్‌రెడ్డి, దుప్పలపల్లి

జనరల్ ఆసుపత్రిలో మూత్రపిండాల వైద్యులు ఒక్కరు కూడా లేకపోవడంతో టెక్నీషియన్‌లు సూచనల పాటిస్తున్నాం. రక్తశుద్ధి జరుగుతున్న సమయం కంటే బయటే ఎక్కువ సమయం వేచిచూడాల్సి వస్తోంది. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి తక్షణం రోగులకు అనుగుణంగా యంత్రాలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

గొలుసు దుకాణాలను ప్రోత్సహిస్తే సహించం

నాంపల్లి, న్యూస్‌టుడే: మద్యం గొలుసు దుకాణాలు, గంజాయి, గుడుంబా అమ్మకాలను ప్రోత్సహించే వారిని ఉపేక్షించేది లేదని మండల కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. మండలంలో అక్రమ మద్యం, మత్తు పదార్థాలు పూర్తిగా నిషేధించాలని కోరుతూ.. మండలకేంద్రంలో మహిళలు, కార్యకర్తలతో కలిసి శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. పల్లెల్లో బెల్టుషాపుల ద్వారా రాత్రీపగలు తేడా లేకుండా మద్యం విక్రయాలు జరుగుతుండటంతో నిరుపేద కుటుంబాల ఆర్థిక స్థితిగతులు, మహిళామణుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి గొలుసు దుకాణాల నియంత్రణకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు ఈ దుకాణాలను ప్రోత్సహించేలా ప్రవర్తిస్తుండటం బాధాకరమని పేర్కొన్నారు. పలువురు మహిళలు మాట్లాడుతూ.. తమ ఇంటిపెద్ద మద్యం, నాటుసారాకు బానిసలై అనారోగ్యంతో కన్నుమూయడంతో కుటుంబపరంగా నష్టపోయి, కుంగుబాటుకు గురయ్యామని కన్నీటి పర్యంతమయ్యారు.



నాంపల్లి : గొలుసు దుకాణాలు, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా మానవహారంగా ఏర్పడిన మహిళలు, కాంగ్రెస్ నాయకులు

■ స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ అభివృద్ధి కమిటీల ద్వారా బెల్టుషాపుల నియంత్రణ, మాదకద్రవ్యాల కట్టడికి కృషిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటయ్య, సంజీవరెడ్డి, శివారెడ్డి, ఎ.నారాయణ రెడ్డి, వెంకటయ్య, ఎస్‌కె.చాంద్‌పాషా, యాదగిరి, కిషన్, చంద్రారెడ్డి, పర్వతాలు, నాగరాజు, చత్రపతి, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఆరబెట్టిన తర్వాతనే కొనుగోలు

మర్రిగూడ, న్యూస్‌టుడే: దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మకాలు జరిపి ప్రభుత్వం కేటాయించిన మద్దతు ధరను పొందాలని జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. తేమ శాతం లేకుండా ఆరబెట్టిన తర్వాతనే కొనుగోలు చేయాలని సిబ్బందికి సూచించారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పించాలన్నారు. ఆయన వెంట శ్రీశైలం, శంకర్, రాజ్యం తదితరులున్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే

హాలియా, న్యూస్‌టుడే: గీత కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన హాలియా కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో గీత కార్మికుల సంరక్షణ కోసం జిల్లా బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాటమయ్య కిట్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మొదటి విడుతగా నియోజకవర్గ స్థాయిలో ఎంపిక చేసిన 100 మంది గీత కార్మికులకు సంరక్షణ కాటమయ్య కిట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణగౌడ్, జిల్లా నాయకుడు నరేందర్‌రెడ్డి హాలియా ఏఎంసీ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, బీసీ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.



హాలియాలో గీత కార్మికులకు కాటమయ్య కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి, తదితరులు

రహదారిపై బియ్యం గింజలు.. రక్తం మరకలు

☛ పీడీఎస్ బియ్యం తరలిస్తూ బోల్తాపడిన వాహనం.. ఒకరి మృతి



రహదారిపై ఉన్న బియ్యం, రక్తపు మరకలు

దామరచర్ల, న్యూస్‌టుడే: రేషన్‌బియ్యం తరలిస్తున్న ఓ వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో ఒకరు మృతి చెందిన ఘటన శుక్రవారం దామరచర్లలో చోటుచేసుకుంది. తెల్లవారుజామున 5 గంటల సమయంలో నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి, నిందితులు ఏపీలోని పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందినవారిగా తెలుస్తోంది.

■ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సుమారు 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లోడుతో ఓ వాహనం తెల్లవారుజామున కొండ్రపోల్ సమీపం నుంచి దాచేపల్లికి బయలుదేరింది. ఈ వాహనాన్ని కొందరు కారులో అనుసరిస్తున్నారు. ఈ క్రమంలో బియ్యం లోడుతో ఉన్న వాహనం దామరచర్లకు చేరుకోగానే ముందు టైరు పగిలింది. దీంతో అదుపుతప్పి రహదారి మధ్యలో వాహనం బోల్తాపడింది. ఈ ప్రమాద సమయంలో వాహనం క్యాబిన్లో ఇద్దరు ఉండగా.. టాప్‌పై ముగ్గురున్నారు. పైన ఉన్న ముగ్గురిపై బియ్యం బస్తాలు పడటంతో వారికి తీవ్రగాయాలయ్యాయి. కారులో వీరిని అనుసరిస్తున్న వారు అక్కడికి చేరుకుని క్షతగాత్రులందరినీ తమ వాహనంలోకి ఎక్కించుకుని దాచేపల్లి వైపు వెళ్లారు. బోల్తాపడిన వాహనాన్ని లేపి అందులో బియ్యం బస్తాలను వేసి.. అక్కడి నుంచి పరారయ్యారు. తెల్లవారేసరికి రహదారిపై బియ్యం చిందరవందరగా ఉండటం, రక్తం మరకలు కనపడటంతో స్థానికులు వాడపల్లి పోలీసులకు సమాచారమిచ్చారు.

■ అక్కడికొచ్చిన పోలీసులు సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి ఏపీ పోలీసులను అప్రమత్తం చేశారు. దాచేపల్లిలో ఈ విషయాన్ని ఆరాతీయగా పీడీఎస్ బియ్యం దందా చేసేవారు ఈ ఘటనలో ఉన్నట్లు తెలిసింది. ప్రమాదంలో గాయపడిన ఎస్‌కే.నాగుర్‌వలి మార్గమధ్యలో మృతిచెందగా అతడి ఇంటి వద్ద మృతదేహాన్ని వదిలేసి.. కారులో వచ్చినవారు పరారయ్యారు. పోలీసులు మృతుడి ఇంటి దగ్గరకు వెళ్లి అతడి భార్య హుస్సేన్‌బీ దగ్గరి నుంచి పూర్తి వివరాలను తెలుసుకున్నారు. దాచేపల్లికి చెందిన ఓ వ్యాపారి కూలీలను తీసుకెళ్లి బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారని.. ఈ క్రమంలో ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఒకరి మృతి, పలువురు క్షతగాత్రులు కావడానికి కారకులైన వ్యక్తిని గుర్తించామని.. త్వరలో వారిని అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు. హుస్సేన్‌బీ ఫిర్యాదు మేరకు వాడపల్లి ఎస్‌హెచ్‌వో నాగిరెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


10 రోజుల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పూర్తి చేయాలి

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆయిల్ పామ్ సాగు రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని ఉదయాదిత్య భవన్‌లో శుక్రవారం ఆయిల్ పామ్ తోటల పెంపకంపై వ్యవసాయ, ఉద్యానశాఖ వారికి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. వచ్చే నెల 10లోపు ప్రతి ఏఈవో తన పరిధిలో కనీసం 150 ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలు పెంచేలా రైతులకు అవగాహన కల్పించి డీడీలు చెల్లించేలా చూడాలన్నారు. జనవరి 1 నుంచి సన్న బియ్యం రేషన్‌కార్డుదారులకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యానశాఖ అధికారి సాయిబాబా, వ్యవసాయశాఖ అధికారి శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

నల్గొండ కలెక్టరేట్: గ్రామీణ, పురపాలికల్లో పది రోజుల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులన్నీ పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం మండల ప్రత్యేక అధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, పురపాలిక కమిషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ☛ గ్రామాల్లో పారిశుద్ధ్యం, మొక్కల సంరక్షణ, తాగునీరు, విద్యుత్తు తదితర పనులు నిరంతరం నిర్వహించేలా చూడాలన్నారు. ☛ వచ్చే వారం నాటికి మండలాల్లో, పురపాలికల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలి.

☛ ఎంపీడీవో పరిధిలో ప్రతి రోజు 2, 3 ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి సౌకర్యాలు, కొనుగోళ్లపై దృష్టి పెట్టాలి.

☛ నవంబరు మొదటి వారంలో రాష్ట్ర బీసీ కమిషన్ జిల్లాలో సోసియో ఎకనామిక్ సర్వేపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తారు.



మూడేళ్లుగా స్నానాల గదే ఆవాసం

కడు పేదరికంలోనూ వారసత్వంగా వచ్చిన పూరింట్లోనే దర్జీగా జీవనం సాగిస్తూ ఇద్దరు మగ పిల్లల్ని పెంచి పెద్ద చేశారు ఆయన. కుమారులు లారీ డ్రైవర్‌గా ఒకరు, పొలం పనులు చేసుకుంటూ మరొకరు చెరో దారి చూసుకుని వేరే గ్రామాల్లో స్థిరపడ్డారు. జీవితాంతం తోడుండాల్సిన భార్య అనారోగ్యంతో తనువు చాలించింది. అనూహ్యంగా ఒంటరివాడైన దర్జీ పల్లెలో తన వృత్తికి ఆదరణ కరవై పూటగడవని స్థితిలో కూలీగా ఒంటరి జీవనం గడుపుతున్నాడు. అప్పటి వరకు ఉంటున్న పూరిల్లూ చెదలు పట్టి కూలిపోవడంతో మళ్లీ ఇల్లు నిర్మించుకునే స్థోమత లేక మూడేళ్లుగా అదే స్థలంలోని స్నానాల గదిలోనే నివాసం ఉంటున్నారు.



★ మఠంపల్లి మండలం బక్కమంతులగూడేనికి చెందిన షేక్ మస్తాన్, మస్తాన్‌బీ దంపతులకు ఇద్దరు సంతానం. వ్యవసాయ భూమి లేదు. దుస్తులు కుట్టి కుటుంబాన్ని పోషిస్తున్న మస్తాన్ భార్య 2019లో అనారోగ్యానికి గురై మృతి చెందింది. కుమారులు ఇద్దరూ బతుకు తెరువు కోసం ఇళ్లు విడిచి వెళ్లారు. దొరికిన పని చేసుకుంటూ మరుగు దొడ్డి పక్కనే ఉన్న స్నానాల గదిలోనే వండుకుని తినడంతో పాటు అక్కడే పడుకుంటున్నట్లు మస్తాన్ చెప్పారు. సరిగ్గా పడుకునేందుకూ సరిపోని స్నానాల గదే తనకు నివాసమైందని చెబుతున్నారు. దుర్భర పరిస్థితిలో ఉన్న తనకు ఇల్లు మంజూరు చేయాలని ప్రాధేయపడుతున్నారు.

- మఠంపల్లి, న్యూస్‌టుడే



నిన్ను నువ్వు పరీక్షించుకో..!

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి వారిని మరింత ప్రోత్సహించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతిఏటా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ సమగ్ర శిక్ష సహకారంతో అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 8-10 తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. సైన్స్ పట్ల విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించడమే కాకుండా వారిని చైతన్య పరిచే విధంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. పాఠశాల స్థాయి మొదలుకుని మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులకు ఈ పోటీలుంటాయి. ప్రధానోపాధ్యాయుల ద్వారా ఈ పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలో సుమారు 3,836 పాఠశాలలుండగా 8-10 తరగతులు చదువుతున్న విద్యార్థులు సుమారు 92 వేల మంది విద్యార్థులకు పైనే ఉన్నట్లుగా తెలుస్తోంది.

- రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే

నవంబరు 7న
పాఠశాల స్థాయి చెకుముకి సంబరాలు

పాఠశాల మొదలుకుని రాష్ట్రస్థాయి వరకు..

విద్యార్థులకు మొదట పాఠశాల స్థాయిలో ప్రతిభా పరీక్ష నిర్వహిస్తారు. నవంబరు 7న పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలు డిసెంబరు మాసంలో ఎంపిక చేసిన ప్రాంతంలో 14-16 వరకు నిర్వహించనున్నారు.

★ 8, 9, 10 తరగతులకు సంబంధించిన సైన్స్, గణితం, సాంఘికశాస్త్రం, సమకాలీన శాస్త్ర, సాంకేతిక అంశాలపై ఈ పోటీలుంటాయి. వీటిని తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో నిర్వహించనున్నారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేస్తారు. అన్ని మండలాల విజేతలకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి ఆయా జిల్లాల నుంచి ఎంపికైన విజేతలకు రాష్ట్రస్థాయికి పంపనున్నారు.

ప్రణాళికతో ముందుకు..



రాజపేటలోని ఓ పాఠశాల ఆవరణలో శాస్త్రీయ అంశాలను శ్రద్ధగా వింటున్న విద్యార్థులు (పాతచిత్రం)

చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాష్ట్ర స్థాయిలో సైన్స్ ప్రయోగాలు, సైన్స్ జాతర, మీట్ ది సైంటిస్ట్, సైన్స్ ఎగ్జిబిషన్, పుస్తక ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లుగా నిర్వాహకులు అంటున్నారు. ముఖ్యంగా అన్ని పాఠశాలల్లో విద్యార్థులు పాల్గొనేలా సైన్స్ ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని సూచిస్తున్నట్లుగా వివరిస్తున్నారు.



విద్యార్థులకు మంచి అవకాశం: కొణతం శ్రీనివాస్, జనవిజ్ఞాన వేదిక, జిల్లా ప్రధానకార్యదర్శి, యాదాద్రి భువనగిరి

సమగ్రశిక్ష, జేవీవీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సంబరాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించే వివిధ రకాల పోటీలు వారికి ఎంతగానో ఉపయుక్తంగా ఉంటాయి. ముఖ్యంగా సైన్స్‌పట్ల మరింత అవగాహన పెంచుకోవడానికి అవకాశం ఉంటుంది. వారి భవిష్యత్తు దృష్ట్యా ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా సైన్స్ ఉపాధ్యాయులు చొరవ చూపితే ప్రయోజనకరం.



ఆయుధం.. వాడే విధం..!

మీ కోసం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

ఒకప్పుడు పోలీసులు తుపాకులు పట్టుకుని తిరుగుతుంటే ప్రతి ఒక్కరు హడలెత్తిపోయే వారు. మారిన పరిస్థితులను బట్టి పోలీసులు ఆయుధాల వాడకం చాలా వరకు తగ్గింది. ప్రస్తుతం వివిధ స్థాయిలో వాడుతున్న ఆయుధాల గురించి నేటి తరం వారికి అంతగా తెలియదు. దీంతో పోలీసుల పనితీరు, ఆయుధాల గురించి తెలిపేందుకు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోలీసులు ప్రస్తుతం వాడుతున్న ఆయుధాలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

పిస్టల్, రివాల్వర్

విధి నిర్వహణలో స్వీయ రక్షణ కోసం చిన్న ఆయుధాలు వాడుతారు. వీటిలో పిస్టల్, రివాల్వర్లుంటాయి. పిస్టల్‌లో 13 బుల్లెట్లు ఉండగా.. పది మాత్రమే లోడ్ చేస్తారు.. రివాల్వర్‌లో ఆరు బుల్లెట్లు ఉంటాయి. ప్రస్తుతం అందరూ పిస్టల్‌లే వాడుతుండగా.. వీటిలో సాధారణ పిస్టల్, బ్లాక్ పిస్టల్ అని రెండు రకాలుంటాయి. సాధారణ పిస్టల్ ఇనుముతో కూడి ఉండగా.. ఇటీవల కాలంలో అందుబాటులోకి వచ్చిన బ్లాక్ పిస్టల్ తేలికైన పదార్థంతో తయారు చేసి ఉంటుంది.

ఎస్ఎల్ఆర్..

ఇవి పొడవుగా ఉండి వివిధ నాయకులు, అధికారులకు రక్షణగా ఉండే గార్డులు ఈ ఎస్ఎల్ఆర్ తుపాకులు వాడుతారు. ఇవి సెల్ఫ్ లోడింగ్ రైఫిల్స్. వీటిలో 20 బుల్లెట్లు ఉంటాయి. అడవుల్లో కూంబింగ్ చేసే సందర్భాల్లో సైతం వీటిని వాడుతారు.

కార్బన్..

వ్యక్తిగత సహాయకులు కార్బన్ ఆయుధాలు వాడుతారు. ఇవి అడుగు పొడవులో ఉండి.. ప్రజా ప్రతినిధులు, అధికారుల వెంట ఉండే రక్షణ సిబ్బంది చేతుల్లో ఎక్కువగా చూస్తూ ఉంటాం. వీటిని సెమీ ఆటో మెటిక్ వెపన్స్ అంటారు. వీటిలో 32 బుల్లెట్లు ఉంటాయి.

ఏకే 47..

జెడ్ కేటగిరీ భద్రత కలిగి ఉన్న నాయకులు, అధికారుల వ్యక్తిగత రక్షణ సిబ్బంది ఏకే 47 తుపాకులు వాడుతారు. అడవుల్లో కూంబింగ్ సమయంలో సైతం వీటిని వాడుతుంటారు. ఇది ఆటోమెటిక్ వెపన్. దీనిలో కూడా 30 బుల్లెట్లు ఉంటాయి.

303 తుపాకులు



మిర్యాలగూడలో పిస్టల్ పని తీరు గురించి విద్యార్థులకు వివరిస్తున్న రెండో పట్టణ సీఐ నాగార్జున, ఎస్సై రాంబాబు

రక్షణ సిబ్బంది, కూంబింగ్ చేసే సందర్భాల్లో పొడవుగా ఉండే 303 తుపాకులు సైతం వాడుతారు. వ్యక్తిగత సహాయకులు సైతం దీనిని ఉపయోగిస్తారు. ప్రస్తుతం వీటి స్థానంలో ఎస్ఎల్ఆర్‌లు వాడుతున్నారు.

★ పోలీస్ శాఖలోని అన్ని స్థాయిల సిబ్బంది ఈ ఆయుధాలు అన్నింటి వాడకంపై అవగాహన కలిగి ఉంటారు.

మొరాయిస్తున్న ట్యాబ్‌లు



ట్యాబ్‌లు మొరాయించడంతో సెల్‌తో డిజిటల్ సర్వే చేస్తున్న ఏఈవో

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే:

లక్ష్యం సమున్నతమే.. కానీ ఆచరణలో అగచాట్లు తప్పడం లేదు. వ్యవసాయ సంబంధిత వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2017, 18 సంవత్సరంలో ఏఈవోలకు ట్యాబ్‌లను, సిమ్‌లను అందజేసింది. ప్రస్తుతం ఆ ట్యాబ్‌లు మొరాయిస్తున్నాయి. ట్యాబ్‌లు పంపిణీ చేసి ఆరేళ్లు కావొస్తుండటంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రధానంగా ఛార్జింగ్ ఉండకపోవడంతో ఏఈవోలు ఇబ్బంది పడుతున్నారు. పంటల నమోదు కోసం క్షేత్రస్థాయి సందర్శనకు పంట పొలాల వద్దకు వెళ్లి వివరాలను నమోదు చేస్తున్న సమయంలో హ్యాంగ్ కావడం, వివరాలు సగం ఆన్‌లైన్ చేశాక స్విచ్ఛ్‌ఆఫ్ అవ్వడం తలనొప్పిగా మారింది. దీంతో మళ్లీ మొదటి నుంచి పొందుపరచాల్సి వస్తుంది. సాఫ్ట్‌వేర్ సమస్యలకు తోడు కొన్ని ట్యాబ్‌లకు నెట్‌వర్క్ సంకేతాలు కూడా అందడం లేదు. పలు చోట్ల ట్యాబ్‌ల డిస్‌ప్లేలు పగిలిపోయాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని పలువురు వాపోతున్నారు. తప్పని పరిస్థితుల్లో ఏఈవోలే మరమ్మతులు చేయించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పాత ట్యాబ్‌ల స్థానంలో కొత్త వాటిని ఇవ్వాల్సి ఉన్నా వాటిపై ఎలాంటి కదలిక లేదు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న ఏఈఓలు	
నల్గొండ	140
సూర్యాపేట	98
యాదాద్రి	72

నమోదు చేసే వివరాలు
★ రైతుబంధు ★ రైతుబీమా
★ పంటల నమోదు ★ కోతుల బెడద

చరవాణిల ద్వారా ఆన్‌లైన్ చేసుకోవచ్చు.
పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ

ట్యాబ్‌లు ప్రస్తుతం అక్కడక్కడ మొరాయిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. పరికరాలు మొరాయిస్తే చరవాణిల ద్వారా యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుని వివరాలను ఆన్‌లైన్ చేసుకోవాల్సి ఉంటుంది. ట్యాబ్‌ల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను.

పసుపు పచ్చగా... ప్రకృతి మెచ్చగా..!



కనుచూపు మేర చిలకపచ్చరంగులో వరి పైరు అందమిది.. నగర శివారు యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం రుద్రారం, జూలూరు గ్రామాల మధ్య మూసీ పరివాహకంలో వేలాది ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. కోత సమయంలో వరిపైరు ఇలా కొంత ముదురు గోధుమ, కొంత ఆకు పచ్చరంగులో కనిపిస్తూ ఆకట్టుకుంటోంది.

- ఈనాడు, నల్గొండ

27న పదివేల మందితో మూసీ పునరుజ్జీవ సభ: ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు, అడ్డగూడూరు, న్యూస్‌టుడే: ఒకప్పుడు పవిత్రమైన నీరు పారే మూసీనది నేడు కాలుష్యంతో నిండిపోయిందని, అందుకే ఈ నది ప్రక్షాళనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూనుకున్నారని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. ముఖ్యమంత్రి తలపెట్టిన ఈ మహాకార్యానికి నదీ పరివాహక ప్రాంత ప్రజలు, రైతులు మద్దతు తెలిపేందుకు ఈ నెల 27న పది వేల మందితో అడ్డగూడూరు మండలం మానాయికుంట వద్ద గల వంతెన వద్ద మూసీ పునరుజ్జీవ సభ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ శుక్రవారం మానాయికుంట వంతెనపైన మోత్కూరు, అడ్డగూడూరు, శాలిగౌరారం మండలాల ముఖ్య నాయకులతో సభాస్థలిని పరిశీలించి, విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వికారాబాద్ కొండల్లో పుట్టి నల్గొండ జిల్లా వాడపల్లి వద్ద కృష్ణానదిలో కలిసే మూసీ నది హైదరాబాద్ మహానగరం మీదుగా సాగుతుందని, దీనిపై ఎన్నో అనుబంధ కాల్వలు నిర్మించి సాగు, తాగునీరు అందిస్తున్నారని చెప్పారు. కలుషితమైన ఈ నీటిని గత ప్రభుత్వం రూ.25 వేల కోట్లతో శుద్ధి చేసేందుకు ఓ కమిటీని కూడా వేసిందని చెప్పారు. ఆ కమిటీ జాడ లేదని, ఎందుకు ఆ పనులు ప్రారంభించలేదో అప్పటి మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు చెప్పాలని డిమాండ్ చేశారు. డీపీఆర్ లేదని, పదేళ్ల పాలించి ఎంత దోచుకున్నారో, ఎంత దాచుకున్నారో ప్రజలకు తెలుసని విమర్శించారు. మూసీకి పునరుజ్జీవం కల్పించేందుకు ముఖ్యమంత్రి కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి మద్దతు తెలుపుతూ, మూసీ నదిని కాపాడుకునేందుకు ఈ ప్రాంత రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ముఖ్య నాయకులు వంగాల సత్యనారాయణ, లింగయ్య, అన్నెబోయిన సుధాకర్, నిరంజన్‌రెడ్డి, చామల అనిల్‌రెడ్డి, పైళ్ల సోమిరెడ్డి, బాలరాజు, వేణుగోపాల్‌రెడ్డి, జోజి, సత్యనారాయణ, రవి, తదితరులు పాల్గొన్నారు.



మానాయికుంట వంతెన సమీపంలో సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్, తదితరులు

సాగర్ నుంచి 12గేట్ల ద్వారా నీటి విడుదల

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: సాగర్ జలాశయానికి వరదనీటి రాక తగ్గటంతో 12 గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం ప్రకారం.. శ్రీశైలం నుంచి 1,45,136 క్యూసెక్కుల వరదనీరు వస్తుండడంతో ఎన్నెస్పీ అధికారులు 12 గేట్లను 5 అడుగుల మేరకు ఎత్తి 96,324 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. గేట్లతోపాటు కుడి, ఎడమకాల్వ, ప్రధాన విద్యుత్కేంద్రం, ఎస్ఎల్బీసీ, వరదకాల్వ ద్వారా మొత్తం 1,45,136 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా ప్రస్తుతం జలాశయ నీటిమట్టం 589.30 అడుగుల వద్ద ఉంది.

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

దేవరకొండ, న్యూస్‌టుడే: కార్తికమాసాన్ని పురస్కరించుకొని దేవరకొండ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఏపీలోని పంచారామక్షేత్రాలకు ప్రత్యేక డీలక్స్ బస్సు సర్వీసులు నడపనున్నట్లు డిపో మేనేజర్ తల్లాడ రమేష్‌బాబు శుక్రవారం స్థానికంగా తెలిపారు. ★ అమరావతిలోని అమరలింగేశ్వరస్వామి, భీమవరంలోని సోమేశ్వరస్వామి, పాలకొల్లులోని క్షీరలింగేశ్వరస్వామి, ద్రాక్షారామంలో భీమేశ్వరస్వామి, సామర్లకోటలోని భీమలింగేశ్వరస్వామి క్షేత్రాలకు నవంబరు 03, 10, 17, 24 తేదీల్లో ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు దేవరకొండ బస్‌స్టేషన్ నుంచి బస్సు బయల్దేరుతుందని పేర్కొన్నారు. ఒకేరోజు పంచారామ క్షేత్రాలను దర్శించుకునే అవకాశం కల్పించినట్లు, దీంతోపాటు కార్తీక పౌర్ణమి సందర్భంగా నవంబరు 13న తమిళనాడులోని అరుణాచలగిరి సందర్శనకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు చెప్పారు. పంచారామ క్షేత్రాలకు డీలక్స్ బస్ చార్జీలు.. పెద్దలకు రూ.2వేలు, పిల్లలకు రూ.1200 ఉంటుందన్నారు.

అధిక సాంద్రత విధానంతో.. లాభాల సంపత్తి



అధిక సాంద్రత పత్తి పంట ప్రదర్శన క్షేత్రం

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే:

పత్తి సాగులో ఆశించిన దిగుబడులు రావడం లేదు. పైగా కూలీల కొరత ఉంటుంది. ఒకేసారి దిగుబడి, అది కూడా ఎక్కువ మొత్తంలో వచ్చేలా అధిక సాంద్రత విధానంలో పత్తి పంటను సాగు చేసేందుకు రైతుల పంట పొలాల్లో ప్రయోగ క్షేత్రాలు నిర్వహించారు. జాతీయ పత్తి పరిశోధన సంస్థ, విత్తన కంపెనీల శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో 1500 ఎకరాల్లో సాగు చేశారు. రైతుకు ఒకేసారి కాత, పూత, కోత వస్తే ఎలాంటి సమస్య ఉండదు. అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేసిన రైతుకు జాతీయ పత్తి పరిశోధన సంస్థ ఎకరాకు రూ.5వేలు ప్రోత్సాహం ఇస్తుంది. ప్రస్తుత సాగు చేస్తున్న సాధారణ పద్ధతులకు భిన్నంగా మూడు విధానాల్లో రైతుల పంట పొలాల్లో సాగు చేయించి, శాస్త్రవేత్తల పర్యవేక్షణలో పరిశోధనలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో అధిక సాంద్రత పత్తి సాగు (ఎకరాల్లో)		
నల్గొండ	సూర్యాపేట	యాదాద్రి
600	500	400

60 లక్షల ఎకరాల్లో..

రాష్ట్రంలో 60 లక్షల ఎకరాల్లో (18 శాతం) పత్తి సాగులో ఉంది. ఏటా పెట్టుబడులు పెరగడం, తెగుళ్ల బెడద, కూలీల కొరతను అధిగమించేందుకు జాతీయ పత్తి పరిశోధన సంస్థ నూతన విధానంలో పత్తి సాగుకు మొగ్గు చూపింది. గతేడాది ప్రయోగాత్మకంగా సాగు చేసిన ప్రాంతాల్లో సత్ఫలితాలు రావడంతో ఈ సీజన్‌లో శాస్త్రవేత్తల పర్యవేక్షణలో డాట్ సెంటర్లు, కృషి విజ్ఞాన కేంద్రాలతో పాటు ఆసక్తి గల రైతులను ఎంపిక చేసి ప్రయోగ క్షేత్రాలను ఏర్పాటు చేశారు.

దిగుబడి
ఈ విధానంలో పత్తి దిగుబడి 12-14 క్వింటాళ్లు వస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సీజన్‌లో ఇప్పటికే కొందరికి ఎకరానికి 12 క్వింటాళ్లు దిగుబడి వచ్చిందని రైతులు వివరించారు.

ఒకేసారి ఏరడం..

సాధారణానికి భిన్నంగా మొక్కల సంఖ్యను పెంచి సాగు చేస్తే దిగుబడి ఎక్కువగా వచ్చే వీలుంది. దీనికి రెండు పద్ధతులను పాటించి ప్రయోగక్షేత్రాలను నిర్వహిస్తున్నారు. అధిక సాంద్రత విధానంలో వరసల మధ్య 90 సెం.మీ., మొక్కల మధ్య 30 సెం.మీ.లు ఉండేలా విత్తనం నాటారు. సంప్రదాయ పద్ధతిలో ఎకరానికి 10 వేల మొక్కలు ఉంటే అధిక సాంద్రత విధానంలో 29,629 మొక్కలు వస్తాయి. సాధారణ పత్తి సాగులో 180 రోజులుంటే విడతల వారీగా అయిదు సార్లు పత్తి ఏరాల్సి ఉంటుంది. అధిక సాంద్రత విధానంలో అయితే 150 రోజుల్లో పంట చేతికి వస్తుంది. పైగా ఒకేసారి ఏరడం పూర్తవుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు

రైతులకు ప్రోత్సాహం

– డాక్టరు అనిల్‌కుమార్ సీనియర్ శాస్త్రవేత్త, ఏరువాక కేంద్రం యాదాద్రి



సాధారణ విధానంలో పత్తి సాగు యాంత్రీకరణకు అనుకూలంగా ఉండదు. నూతన విధానంలో సాగు లాభదాయకం. అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేసేందుకు ముందుకు వచ్చే రైతులతో క్లస్టర్ ఏర్పాటు చేసి ఎంపిక చేసిన వారికి రూ.5 వేలు ప్రోత్సాహం అందిస్తున్నాం. గతేడాది, ఇప్పుడు రైతులకు ఎకరాకు 12-14 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వస్తుంది. భవిష్యత్తులో సాగు విస్తీర్ణం పెంచాలని జాతీయ పత్తి పరిశోధన సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.



భళా.. వనమాల

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ విజేతగా శశాంక్

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: తమిళనాడు రాజధాని చెన్నైలో శుక్రవారం జరిగిన అండర్-15 సింగిల్స్ బ్యాడ్మింటన్ ఫైనల్ పోటీల్లో నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన వనమాల శశాంక్ విజేతగా నిలిచాడు. హైదరాబాద్‌లోని గోపీచంద్ అకాడమీలో శిక్షణ పొందుతూ.. రాష్ట్రం తరఫున టోర్నీలో పాల్గొన్న శశాంక్.. అండమాన్ నికోబార్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ క్రీడాకారులపై విజయం సాధించి.. ఫైనల్స్‌లో ప్రవేశించాడు. ఫైనల్స్‌లో కర్ణాటక క్రీడాకారుడు పుష్కర్ సాయిపై 21-9, 15-21, 21-17 తేడాతో విజయం సాధించి జాతీయ ఛాంపియన్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా మిర్యాలగూడకు చెందిన బ్యాడ్మింటన్ జిల్లా శిక్షకుడు మారబోయిన రామకృష్ణ, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ప్రశాంత్, నవీన్‌కుమార్, శ్రీకాంత్‌తో పాటు పలువురు సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

చికెన్ ధరలు	
ఫాంరేటు	115-00
రిటైల్	137-00
డ్రెస్ట్	199-00
స్కిన్‌లెస్	226-00

నల్గొండ

•నల్గొండ •మునుగోడు •నకిరేకల్

సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ఎంపిక

నల్గొండ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తమిళనాడు రాష్ట్రంలో త్వరలో జరిగే సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు నల్గొండ నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఉదయ్ ఎంపికయ్యాడు. ఆ యువకుడిని శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ ఉపేందర్ అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. వైస్ ప్రిన్సిపల్ పిల్లి సురేశ్‌బాబు, పీడీ మల్లేశం, రవికుమార్, బి.నాగరాజు, ప్రసన్నకుమార్, శ్రీధర్, శ్రావణి పాల్గొన్నారు.



సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైన ఉదయ్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ ఉపేందర్, అధ్యాపకులు

సాందీప్ విద్యార్థుల ప్రతిభ

నీలగిరి, న్యూస్‌టుడే: శ్రీనివాస రామానుజన్ లెవల్-1 పరీక్ష ఫలితాల్లో స్థానిక సాందీప్ స్కూల్ విద్యార్థులు 16 మంది ఉత్తమ ప్రతిభ కనబర్చి లెవల్-2కు ఎంపికయ్యారని ఆ పాఠశాల కరస్పాండెంట్ గానుగల సత్యనారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ సత్యనారాయణరెడ్డి

కేంద్ర పథకాలు వివరించండి

నకిరేకల్, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని భాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న కోరారు. మండలంలోని చందుపట్లలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో శుక్రవారం మాట్లాడారు. సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. మండలాధ్యక్షుడు, కార్యదర్శులు యానాల శ్రీనివాస్‌రెడ్డి, బుడిగె సైదులు, సాయన్న, శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.



నకిరేకల్: పార్టీ మండల కార్యదర్శికి సభ్యత్వం అందజేస్తున్న మొగులయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకన్న

మద్య నిర్మూలనకు భాజపా మద్దతు..

నాంపల్లి: మండలంలో నిష్పక్షపాతంగా బెల్టు షాపులు, నాటుసారాను నిర్మూలిస్తే భాజపా మద్దతు ఇస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దాచెపల్లి నర్సింహ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విధానం కొందరికే పరిమితం కాకుండా మండలంలో సంపూర్ణంగా అమలు చేయాలని కోరారు. సీహెచ్.గిరిబాబు, నాంపల్లి సతీశ్, శ్రీకాంత్, లింగస్వామి, తదితరులున్నారు.

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? పట్టణంలోని బస్టాండ్ రోడ్డు నుంచి రైల్వే స్టేషన్ వెళ్లే మార్గం గుంతలమయంగా మారింది. మరమ్మతులు చేయించాలి.

– ఆనంద్‌కుమార్, నల్గొండ.

✔ పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేయిస్తాం.

– అశోక్, డీఈ, నల్గొండ పురపాలిక.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 52710, 80085 66199 8008574421, 80085 74385

మర్రిగూడ, న్యూస్‌టుడే:

? మండల కేంద్రంలోని ఈదమ్మగుడ్డలో వీధిలైట్లు వెలగటం లేదు. రాత్రి సమయంలో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– నోముగు రాజేందర్‌రెడ్డి, ఈదమ్మగడ్డ, మర్రిగూడ

✔ విషయం మా దృష్టికి వచ్చింది. పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం.

– యూసఫ్, పంచాయతీ కార్యదర్శి, మర్రిగూడ

? మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామం 4వ వార్డులో అంగన్వాడీ కేంద్రం చుట్టూ దోమల బెడద ఎక్కువగా ఉంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– పాండు, రాంరెడ్డిపల్లి గ్రామస్థుడు

✔ సిబ్బందితో దోమల మందు పిచికారీ చేయిస్తాం.

– నజీర, పంచాయతీ కార్యదర్శి, రాంరెడ్డిపల్లి

గుంతలమయం.. గుండెల్లో భయం..!



కొండపాకోనిగూడెం నుంచి బొరవాణికి వెళ్లే మార్గం ఇలా..

అసంపూర్తి పనులు.. అవస్థల్లో ప్రజలు

నార్కట్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గోపలాయపల్లి నుంచి కొండపాకోనిగూడెం మీదగా బొరవాణి గ్రామం వరకు బీటీ రోడ్డు పనులను రెండేళ్ల క్రితం ప్రారంభించారు. ఈ మార్గం గోపలాయపల్లి, ఎనుగులదోరి, కొండపాకోనిగూడెం మీదగా బొరవాణి గ్రామం వరకు 10 కి.మీ. విస్తరించింది. గుత్తేదారు రోడ్డును చదును చేసి కంకర పరిచారు. అసంపూర్తి పనులతో అటువైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాదాలు సంభవిస్తున్నాయని.. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నరకప్రాయంగా ఉంది

–చేకూ వెంకట్‌రెడ్డి రైతు, కొండపాకోనిగూడెం

ఈ మార్గం గుండా బొరవాణి మీదగా ద్విచక్రవాహనంపైన నిత్యం ప్రయాణిస్తుంటాను. రోడ్డును చదును చేసి కంకర పరిచి మిగతా పనులు ఆపేశారు. కంకర రోడ్డుపై ప్రయాణిస్తుండటంతో ద్విచక్రవాహనాలు దెబ్బతింటున్నాయి. వ్యవసాయ పనుల నిమిత్తం నిత్యం ఇటు వెళ్లాల్సి వస్తోంది. దుమ్ము, ధూళి వడి ప్రయాణం నరకంగా ఉంది.

గుత్తేదారునికి సూచించాం

– మల్లికార్జున్, పంచాయతీరాజ్ ఏఈ

ఈ మార్గం పనులు పూర్తి చేయాలని సంబంధిత గుత్తేదారునికి పలుమార్లు సూచించాం. బిల్లులు రావడంలేదని అసంపూర్తిగా నిలిపివేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పీఆర్ఏఈ తెలిపారు.

కనగల్, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రహదారులు గుంతలమయంగా మారాయి. నిధులు లేక ఇబ్బంది పడుతుండగా.. కొన్ని చోట్ల నిధులున్నా పనులు ముందుకు సాగడంలేదు. అంతర్గత రోడ్ల దుస్థితి మరీ హీనంగా మారింది. చినుకు పడితే చిత్తడిగా మారి వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.



ఎల్లమ్మగూడెం నుంచి దర్వేశిపురం రహదారి

★ దొరేపల్లి- బోయినపల్లి రహదారి పూర్తిగా గుంతలమయమై వాహనాలు వెళ్లలేని పరిస్థితి. ఎక్కువగా ఇసుక ట్రాక్టర్లు నడుస్తుండటంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఎన్నికల సమయంలో బీటీగా మారుస్తామని హామీ ఇచ్చినా ఆ దిశగా అడుగులు పడటం లేదు. ఐదు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావడానికి ఇదే దగ్గరి దారి.

★ దర్వేశిపురం వయా కుమ్మరిగూడెం, తేలకంటిగూడెం వరకు గతంలో సడక్ యోజన కింద నిధులు మంజూరు కాగా గుత్తేదారు ముందుకు రాకపోవడంతో పనులు నిలిచి పోయాయి.

★ దర్వేశిపురం- మంచినీళ్ల బావి, కనగల్- చండూరు ప్రధాన రహదారి, సాగర్ రోడ్డు నుంచి వయా తిమ్మన్నగూడెం-కనగల్, సాగర్ రహదారి నుంచి చర్లగౌరారం, దేవరకొండ రోడ్డు నుంచి తుర్కపల్లి, తుర్కపల్లి నుంచి ఎం.గౌరారం, నల్గొండ నుంచి కనగల్ వరకు ప్రధాన రహదారిలో అక్కడక్కడ పెద్దపెద్ద గుంతలు, సాగర్ నుంచి చెట్లచెన్నారం- చిన్నమాదారం రహదారులు అధ్వానంగా మారాయి.



సాగర్ రోడ్డు నుంచి వయా తిమ్మన్నగూడెం-కనగల్ రహదారి

ప్రతిపాదనలు పంపించాం..

రామకృష్ణ, ఏఈ, పీఆర్, కనగల్

గుంతలమయంగా మారిన రహదారుల మరమ్మతులకు నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నియోజకవర్గంలో 16 నూతన రోడ్లు మంజూరు అయ్యాయి. అందులో కనగల్ ఆరు రోడ్లకు పీఆర్‌ఆర్ గ్రాంట్ కింద నిధులు వచ్చాయి.

ఐక్యతతో సాగితేనే సమస్యల పరిష్కారం

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: సభ్యులు ఐక్యతతో ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు పొట్టబత్తుల సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా లెక్కల్లో అధిక శాతం ఉన్న పద్మశాలీలకు రాజకీయంగా పదవులు దక్కడం లేదన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాపోలు దత్తగణేశ్, యాదగిరి, సతీశ్‌కుమార్, లక్ష్మీనారాయణ, వెంకటేశం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పద్మశాలి జిల్లా సంఘం అధ్యక్షుడు పొట్టబత్తుల సత్యనారాయణ

కేతేపల్లి వాసికి డాక్టరేట్

కేతేపల్లి, న్యూస్‌టుడే: కేతేపల్లికి చెందిన యువ కుడు దండు హరీశ్ 'భాషా సృజనాత్మకత' అనే అంశంపై ఐదేళ్ల పాటు పరిశోధన చేసి డాక్టరేట్ సంపాదించారు. హైదరాబాద్‌లోని ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అధ్యయనం చేశారు.



ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు నుంచి డాక్టరేట్ అందుకుంటున్న దండు హరీశ్

యువత పోలీస్ ఉద్యోగాలు సాధించాలి

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని నల్గొండ టూటౌన్ పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని కాకతీయ డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. టూటౌన్ ఎస్సై నాగరాజు మాట్లాడుతూ యువత పోలీస్ ఉద్యోగాల సాధనకు కృషి చేయాలని కోరారు. సమాజంలో పోలీస్ వృత్తికి అరుదైన గౌరవం ఉందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ నర్సింహారెడ్డి, సైదిరెడ్డి, భవాని, యామిని, మానస, స్వాతి, సురేశ్, పాల్గొన్నారు.



నల్గొండ కాకతీయ డిగ్రీ కళాశాలలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రేరణ పాఠశాలలో..

నల్గొండ టౌన్: నల్గొండ వన్‌టౌన్ పీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రేరణ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో పోలీస్ ఉద్యోగాల సాధించేందుకు కృషి చేయాలని కోరారు. పాఠశాల కరస్పాండెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ రవీందర్, ఏఎస్ సురేందర్‌రెడ్డి, మమత పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలు సరికాదు

చిట్యాల, న్యూస్‌టుడే: రాజ్యాంగ పీఠికలో పొందుపరిచిన సెక్యులర్, సోషలిస్టు పదాలను తొలగించాలనే యోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని నేరడలో శుక్రవారం జరిగిన పార్టీ గ్రామశాఖ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదేళ్లలో దేశంలో మతపరమైన కార్యక్రమాలతో పాటు ప్రజాస్వామ్య శక్తులపై దాడులు, నిర్బంధాలు పెరిగాయన్నారు. జమిలి ఎన్నికలు నిర్వహించాలని కేంద్రం భావించడం సరైనది కాదన్నారు. పిల్లలమర్రి లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేశ్, శంకరయ్య, శ్రీను, కుమార స్వామి, మాజీ సర్పంచి ఎల్లయ్య, గణేశ్, యాదయ్య పాల్గొన్నారు.



చిట్యాల: నేరడలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

నార్కట్‌పల్లి గ్రామీణం: పేదలకు భాజపా ప్రభుత్వం చేసిందేమీ లేదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి విమర్శించారు. బొరవాణిలో ఆ గ్రామ 18వ మహాసభ నీరుడు కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో ఒకే ఎన్నికల విధానం ఫెడరల్ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. వెంకటేశ్వర్లు, కందమహేశ్వరం, పెద్దులు, యాదగిరి పాల్గొన్నారు.

దేవతా కల్యాణోత్సవాలకు ముస్తాబు

నకిరేకల్, న్యూస్‌టుడే: మూడు రోజుల పాటు నిర్వహించే దేవతా కల్యాణోత్సవాలకు నకిరేకల్‌లోని శ్రీసత్యసాయి మందిరం ముస్తాబైంది. శని, ఆది, సోమవారాల్లో ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. శనివారం సీతారాముల కల్యాణోత్సవం, ఆదివారం సువర్చలా హనుమత్ కల్యాణోత్సవం, సోమవారం పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవాలను నిర్వహిస్తామని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు దేవరశెట్టి శ్రీనివాసులు, నకిరేకల్ సమితి కన్వీనర్ గర్రె శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. లోక కల్యాణం కోసం నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు ప్రతి రోజు ఉదయం 5 గంటలకు ప్రభాత సేవ, 8 గంటలకు పారాయణం, త్యాగరాజ కీర్తనలు, 10 నుంచి 12 గంటల వరకు కల్యాణోత్సవం, సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు సంగీత కచేరీ, హరికథ, ప్రవచనాలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఉత్సవాల పుట్టపర్తి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె రత్నాకర్ విచ్చేస్తున్నారని వివరించారు.



రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

కేతేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామ శివారులో 65వ నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణా జిల్లా కంకిపాడుకు చెందిన షేక్ బాషా(34) తన అశోక్ లేలాండ్ తోలుకుంటూ ఉప్పలపహాడ్ జంక్షన్ శివారు దాటుతుండగా విజయవాడ నుంచి హైదరాబాద్‌లోని ఆటోనగర్‌కు వెళ్తున్న ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాషా అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై ఎ.శివతేజ వివరించారు.

శిశుసంక్షేమ కమిటీకి చిన్నారి అప్పగింత

నాంపల్లి: గట్టుమల్లేపల్లికి చెందిన మల్లిరెడ్డి సైదిరెడ్డి(36) ఇటీవల అనారోగ్య కారణంగా మనస్తాపానికి గురైన పురుగుల మందు తాగి మృతి చెందాడు. అతని భార్య మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న నేపథ్యంలో మూడేళ్ల వయసున్న వారి కుమార్తె వర్షిణిను ఇటీవలే హైదరాబాద్‌లోని కీర్తనా ఫౌండేషన్ సంరక్షణలో ఉంచారు. కాగా చిన్నారిని విక్రయించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం ఐసీడీఎస్ అధికారులు జిల్లా శిశుసంక్షేమ కమిటీకి అప్పగించినట్లు ఎస్సై ఎం.శోభన్‌బాబు తెలిపారు. విచారణ అనంతరం వారి బంధువులకు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యుడికి అభినందన

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన డా.చారకొండ వెంకటేశ్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు మనిమద్దె పరమేశ్‌రాజ్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. జిల్లాలో విశ్వవిద్యాలయం, కళాశాలల పరిస్థితులను ఆయనకు వివరించారు. మంద రమేశ్, సతీశ్, వంశీ, అయ్యప్ప, శాంతికుమార్, పవన్, గణేశ్ ఉన్నారు.

పుస్తకాలు చదివి.. నిరసన తెలిపి

నల్గొండ విద్యావిభాగం: విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నల్గొండ తహసీల్ కార్యాలయం ఎదుట విద్యార్థులు పుస్తకాలు చదివి నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆకారపు నరేశ్, ఖమ్మం పాటి శంకర్, కిరణ్, మున్నా, జోసెఫ్, నవదీప్, స్పందన, సన్ని పాల్గొన్నారు.

కట్టంగూరు: విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. సాయి, గోవింద్, సతీశ్, లింగస్వామి ఉన్నారు.

సత్కారం .. నల్గొండ సంక్షేమం: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీయూటీఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా ఆరోసారి ఎన్నికైన వంగూరి లక్ష్మీనారాయణను టీఆర్‌ఎస్‌వై రాష్ట్ర ప్రధానకార్యదర్శులు బొమ్మరబోయిన నాగార్జున, దల్ల కోటేష్‌యాదవ్‌లు సత్కరించారు. నల్గొండలో శుక్రవారం ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నాగరాజు, శ్రీనివాస్, సురేశ్ పాల్గొన్నారు.

వేలం నిర్వహణ

కనగల్: దర్వేశిపురం రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద పూలు, పండ్లు విక్రయించడానికి నిర్వహించిన వేలంలో కుమార్ అనే వ్యక్తి రూ.13.06 లక్షలకు టెండర్ దక్కించుకున్నారు. గతేడాది రూ.10.45 లక్షలు పలికింది. మిగతా వాటిని వాయిదా వేసినట్లు ఈవో జలసూత్రం శ్రీనివాసమూర్తి తెలిపారు. ఎస్ స్పెక్టర్ సుమతి, చంద్రయ్యగౌడ్, నాగేశ్వర్‌రావు, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

29న ధర్మయుద్ధ సభ

నకిరేకల్, న్యూస్‌టుడే: సర్వోన్నత న్యాయస్థానం తీర్పునకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న నల్గొండలో మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో నిర్వహించే మాదిగల ధర్మయుద్ధ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేడి శంకర్‌మాదిగ డిమాండ్ చేశారు. నకిరేకల్‌లో విలేకరుల సమావేశంలో శుక్రవారం మాట్లాడారు. తీర్పు వెలువడిన తర్వాత వర్గీకరణ అమలు కోసం అసెంబ్లీలో తీర్మానం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. నల్గొండ సభకు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల శ్రేణులు తరలిరావాలని కోరారు. నాయకులు వందలికిరణ్‌మాదిగ, నిరంజన్, ఎన్.రమాకాంత్, జి.సురేశ్, ఏ.శ్రావణ్, ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేడి శంకర్‌మాదిగ, నాయకులు

రైల్వే యూనియన్ ఎన్నికల ప్రచారం

నీలగిరి, న్యూస్‌టుడే: దక్షిణ మధ్య రైల్వే ట్రేడ్ యూనియన్ ఎన్నికల ప్రచారం శుక్రవారం నిర్వహించారు. మిర్యాలగూడ నుంచి బొమ్మాయిపల్లి వరకు నిర్వహించిన కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ గుంటూరు డివిజన్ కార్యదర్శి ఎం.వి.ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ముందుంటామని చెప్పారు. యూనియన్ గెలుపులో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. మంజునాథ్, కోటేశ్వర్‌రావు, కరణ, లావణ్య, సాంబశివరావు, నాగిరెడ్డి, ఐలయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న గుంటూరు డివిజన్ కార్యదర్శి ఎం.వి.ప్రసాద్

సినిమాలు నల్గొండ కల్చరల్, నకిరేకల్

నల్గొండ: నటరాజ్: దేవర, తిరుమల: పగలు-లగ్గం. రాత్రి-వెనమ్, వెంకటేశ్వర: పొట్టేల్

నకిరేకల్: రామకృష్ణ- పొట్టేల్, వెంకటేశ్వర- దేవర

సంక్షిప్త సమాచారం

రాత పుస్తకాల పంపిణీ

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీ భక్తాంజనేయ స్వామి సేవా సంస్థ ఆధ్వర్యంలో నల్గొండ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని బాలబాలికలకు శుక్రవారం రాతపుస్తకాలు, పలకలు, పెన్నులు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు శ్రీనివాసరావు, నరసింహ, శంకర్ పాల్గొన్నారు.

కట్టంగూరు: చెర్వుఅన్నారం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లు, నోట్ పుస్తకాలను స్థానికుడు పి.వెంకటేశ్, బి.మహేశ్ శుక్రవారం అందజేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మాడ్గులపల్లి: పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేస్తే చర్యలు తప్పవని ఎస్సై కృష్ణయ్య హెచ్చరించారు. మాడ్గులపల్లి గ్రామ పరిధిలో పలు ఇళ్లలో 16 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసిన దామరచర్ల మండలం కేజీఆర్ కాలనీకి చెందిన మహిళపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎన్నిక

గట్టుప్పల, న్యూస్‌టుడే: సీపీఎం మండల కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన కర్నాటి మల్లేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కమిటీ సభ్యులుగా చాపల మారయ్య, నరేశ్, వెంకటేశం, రాములు, సుధాకర్, శివతో పాటు పలువురు నియమితులయ్యారు.

27న పుస్తకావిష్కరణ

నకిరేకల్: విజ్ఞాన శాస్త్రానికి సంబంధించి తాను రచించిన 'సత్య వీక్షణం' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఈనెల 27న స్థానిక పీఆర్టీయూ భవన్‌లో నిర్వహిస్తున్నామని నకిరేకల్‌కు చెందిన ఉపాధ్యాయుడు గెంబెల శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బియ్యం అందజేత

మర్రిగూడ: మండల పరిధిలోని దామెరభీమనపల్లి గ్రామానికి చెందిన జేడీ కృష్ణయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు సిలివేరు చిన్నయ్య 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను బాధిత కుటుంబానికి అందజేశారు. వీరువడయ్య, నర్సింహ పాల్గొన్నారు.

ఆదరించండి

మర్రిగూడ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అల్లుభీమల్లరెడ్డి గెలిపిస్తే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారమవుతాయని టీపీయూఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు పాఠశాలల్లో ఆయనకు మద్దతుగా ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీనివాస్, కృష్ణయ్య, నాగేంద్రమ్మ, పుష్పలత, నీలిమ, వేదవతి, జ్యోతి, విజయలక్ష్మి, సునీత తదితరులు ఉన్నారు.

అధికారిపై చర్యలు తీసుకోవాలి

మునుగోడు: తనపై వచ్చిన ఫిర్యాదుపై విచారణ.. కోసం తన సమాధానం కూడా వినకుండా, ఆధారాలుగా తీయకుండా చర్యలు తీసుకున్నారని ఏఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఓ రైతు డిమాండ్ చేశారు. బాధిత రైతు మున్నాల మల్లేశం తెలిపిన వివరాల ప్రకారం.. తన భూమి పక్కనున్న ఓ రైతుతో కొద్ది రోజులుగా గొడవ జరుగుతోంది. దీనిపై సదరు రైతు సెప్టెంబర్ 30న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆ సమయంలో ఏఎస్ఐ ఫోన్‌కు సమాధానం ఇవ్వలేకపోవడంతో ఆవేశంతో తన భూమి వద్దకొచ్చి అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు తనపై దాడి చేసినట్లు తెలిపారు. దీనిపై ఈనెల 17న జిల్లా ఎస్పీ కార్యాలయంలో సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రైతుపై ఏఎస్ఐ చేయిచేసుకున్న సమయంలో తీసిన వీడియోలే సాక్ష్యంగా నిలవడం గమనార్హం. ఈ విషయంపై సీఐ వెంకటయ్యను వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, వీడియో ఆధారంగా విచారణ చేసి ఐజీ కార్యాలయానికి నివేదిక పంపినట్లు సమాధానమిచ్చారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కేతేపల్లి: కేతేపల్లిలో అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ముదిరెడ్డి వీరారెడ్డి కుటుంబసభ్యులను శుక్రవారం ఎమ్మెల్యే వేముల వీరేశం పరామర్శించారు. వీరారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గుండెపోటుతో మృతిచెందిన కేతేపల్లికి చెందిన యువకుడు పసల జయరాజు మృతదేహంపై పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి కోట రవీందర్, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేతేపల్లిలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వీరారెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, నాయకులు

మండల ప్రత్యేక అధికారి తనిఖీ

కట్టంగూరు: కట్టంగూరులోని కస్తూర్బా విద్యాలయాన్ని మండల ప్రత్యేక అధికారి కోటేశ్వరరావు తనిఖీ చేశారు. వంటశాలను, ఆహార పదార్థాలను, దస్త్రాలను పరిశీలించారు. తరగతి గదులను పరిశీలించి, పదో తరగతి విద్యార్థులను గణితంలో ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. మండల వైద్యాధికారి శ్వేత, ఎంపీడీవో జ్ఞాన ప్రకాశ్, ఏఈలు నవీన్, జబీల్, ఏపీఎం సైదులు, ఏపీవో రామ్మోహన్ పాల్గొన్నారు.

చెరువును ఖాళీచేస్తే కఠిన చర్యలు

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్‌లోని ఎర్రకుంట చెరువులో నీరు నిల్వ ఉండకుండా ఖాళీచేసేందుకు యత్నిస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నీటిపారుదల శాఖ నకిరేకల్ ఏఈ పాండునాయక్ హెచ్చరించారు. ఎర్రకుంట చెరువు అలుగును గతంలో రెండు అడుగుల మేర కిందికి తవ్వి నీరు పూర్తిస్థాయిలో నిల్వ ఉండేలా కొంతమంది ప్రయత్నిస్తున్నారు. ఈ విషయాన్ని పరిశీలించారని ప్రస్తుతం ఎంపీటీసీ చెరువు పూడ్చివేయించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు పోలీసులతో కలిసి శుక్రవారం వెళ్లారు. ఆ కల్వర్టును పూడ్చివేయడమైన స్థానికులు కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. చెరువు శిఖం ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్నవారు చెరువు నిండితే తమ ఇళ్లలోకి నీరు చేరుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో భూగర్భ జలాల సమస్యలు రాకుండా చెరువును కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, ప్రస్తుతం ఎంపీటీసీ నీటితో ఆ చెరువును నింపేందుకు ప్రభుత్వం ఆదేశించిందని ఏఈ వివరించారు. చెరువును పూర్తి స్థాయిలో నింపేందుకు చర్యలు చేపడతామని, నీరు రెండు రోజుల్లో మళ్లీ సందర్శిస్తామన్నారు. కార్యక్రమంలో పుర కౌన్సిలర్ గాజుల సుకన్య పాల్గొన్నారు.



నకిరేకల్: ఎర్రకుంట చెరువు వద్ద స్థానికులతో మాట్లాడుతున్న ఐబీ ఏఈ పాండునాయక్, కౌన్సిలర్ సుకన్య

భారాస హయాంలోనే

సిమెంట్ పరిశ్రమకి భూములు

నార్కట్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రామన్నపేటలో ఏర్పాటు చేయనున్న సిమెంట్ పరిశ్రమకు భూములను భారాస హయాంలోనే ఇచ్చారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఉశయ్య, పాశం శ్రీనివాసరెడ్డి, సట్టు సత్తయ్య, దూదిమెట్ల సత్తయ్యలు ఆరోపించారు. మంత్రి కోమటిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కు మార్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. భరత్, నర్సింహ, సత్యనారాయణ, అచ్చాలు పాల్గొన్నారు.

నకిరేకల్: మంత్రిపై గాదరి కిశోర్‌కుమార్ వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల సుకన్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నార్కట్‌పల్లి గ్రామీణం: కాంగ్రెస్ నాయకులు పద్దే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో యల్లారెడ్డిగూడెంలో గాదరి దిష్టిబొమ్మను దహనం చేశారు.

మిర్యాలగూడ

•మిర్యాలగూడ •నాగార్జునసాగర్ •దేవరకొండ

ఇంజినీరింగ్ విద్యార్థుల యోగాసనాలు



యోగాసనాలు సాధన చేస్తున్న మీనా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: పతంజలి నిత్య యోగ సాధన సంస్థ ఆధ్వర్యంలో మీనా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం యోగాసనాలు, ధ్యానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యోగ గురూజీ పోలిశెట్టి లక్ష్మయ్య ఆధ్వర్యంలో విద్యార్థినులతో సామూహికంగా యోగాసనాలు వేయించి ధ్యానం చేయించారు. కార్యక్రమంలో సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

నవంబరు 1న ఎంపిక

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: హాలియాలోని శ్లోక పాఠశాలలో నవంబరు 1న ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-19 బాల బాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అండర్-19 ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.ఇందిర శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
77994 92939
99121 74975
98487 81656

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? త్రిపురారం నుంచి అడవిదేవులపల్లి వరకు, నిడమనూరు మండలం ముకుందాపురం నుంచి కోటమైసమ్మ ఆలయ వరకు రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారాయి.
– శ్రీను, మిర్యాలగూడ

✔ రహదారికి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్, ఆర్ అండ్ బీ డీఈఈ, హాలియా

ఆక్రమణలపై సబ్ కలెక్టర్ విచారణ



ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలపై విచారణ చేస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ పట్టణం: మిర్యాలగూడలోని తాళ్లగడ్డలో సర్వే సంఖ్య 60, 61 ప్రభుత్వ సీలింగ్ భూమి 3.14 ఎకరాల్లో గతంలో కూల్చిన అక్రమ కట్టడాల్లో తిరిగి నిర్మించిన నిర్మాణాలను శుక్రవారం సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ పరిశీలించారు. ప్రభుత్వ భూమి ఆక్రమణలపై ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో నిర్మాణాలపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే పూర్తిస్థాయి సర్వే చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దారు హరిబాబు, సత్యనారాయణ, రామకృష్ణ, ఖాద్రి ఉన్నారు.

త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులు

చింతపల్లి: రోడ్డు నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నట్లు పంచాయతీరాజ్ డీఈ జీవన్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని తక్కళ్లపల్లి నుంచి ఎం.మల్లేపల్లి గ్రామం వరకు మంజూరైన రోడ్డును ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రెండు గ్రామాల మధ్య రోడ్డు సరిగా లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, దీన్ని పూర్తి చేస్తే ప్రజలకు, ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. నర్సింహారెడ్డి, వెంకటేశ్, వెంకటయ్య తదితరులున్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

మాడ్గులపల్లి, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మాడ్గులపల్లి మండలంలోని కుక్కడంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నజీర్(50) రోజు మాదిరిగానే గేదెను మేపటానికి తీసుకెళ్లారు. ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో గేదె నీళ్లు తాగటానికి చెరువు వద్దకు వెళ్లింది. నీళ్లు తాగి చెరువులోకి అలానే వెళ్లసాగింది. దాన్ని వెంబడించిన నజీర్ లోపలి వరకు వెళ్లారు. ఎంతకు బయటకు రాకపోవటంతో అక్కడే గేదెలను మేపుతున్న స్థానికులు, ఇతరుల సహాయంతో చెరువులో వెతికారు. అప్పటికే నజీర్ చెరువులో మునిగి మృతిచెందారు.

నక్షా.. భూముల లెక్క పక్కా



మిర్యాలగూడ పట్టణం

మిర్యాలగూడ పట్టణం, మిర్యాలగూడ, న్యూస్‌టుడే: గ్రామాల్లో సాగు భూములను పక్కాగా ఉండే నక్షా మాదిరిగా.. పట్టణాల్లోని భూములకు సైతం చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. దీని కోసం పైలట్ ప్రాజెక్టు కింద తొలుత తెలంగాణ రాష్ట్రం వంద పట్టణాలను ఎంపిక చేయగా.. రాష్ట్రం నుంచి ఎనిమిది పురపాలికలను ఎంపిక చేశారు. ఇందులో ఉమ్మడి జిల్లా నుంచి మిర్యాలగూడ పురపాలికను పైలట్ ప్రాజెక్టుకు ఎంపిక చేశారు. దీంట్లో భాగంగా ఇటీవల దిల్లీలో రెండు రోజుల పాటు జరిగిన సర్వే రీ సర్వేపై అంతర్జాతీయ కార్యశాలకు పుర కమిషనర్ ఎండీ యూసుఫ్ హాజరయ్యారు.

> "రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా మిర్యాలగూడ"

ప్రభుత్వ ఆదేశాలు రావాలి



ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ

దిల్లీలో జరిగిన అంతర్జాతీయ కార్యశాలలో అమెరికా, కొరియా, యూకే వంటి దేశాలకు చెందిన ప్రతినిధులు తమ దేశంలో చేపట్టే సర్వే రీ సర్వేపై వివరించారు. పలు దేశాలతో పాటు మధ్యప్రదేశ్, అస్సాంలో సైతం డ్రోన్ల ద్వారా సర్వే చేస్తున్నట్లు తెలుసుకున్నాం. పట్టణంలో నక్షా సర్వే చేసేందుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ఆదేశాలు రాగానే సర్వేను ప్రారంభించనున్నాం.

మిర్యాలగూడ పురపాలిక వివరాలు..

మొత్తం వార్డులు:	48
భవనాల సంఖ్య:	26,108
పట్టణ జనాభా:	సుమారు 1.46 లక్షలు

డ్రోన్లతో ఛాయాచిత్రాలు..



నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్ (ఎన్ఏజీఈఎస్‌హెచ్‌ఏ-నక్షా) పథకం కింద సర్వే ఆఫ్ ఇండియా, పురపాలిక, భూమి కొలతలు, దస్త్రాల నిర్వహణ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా మిర్యాలగూడలో నక్షా రూపొందించే కార్యక్రమం చేపట్టనున్నాయి. దీంట్లో భాగంగా ప్రైవేట్ సంస్థ భాగస్వామ్యంతో సర్వే ఆఫ్ ఇండియా పట్టణంలో డ్రోన్లతో ఛాయాచిత్రాలు తీసి.. వాటి పరిశీలన పూర్తి చేసి.. క్షేత్ర స్థాయిలో సర్వే చేయనున్నారు. నక్షా పథకంలో ప్రతి ఇల్లు, ఖాళీ స్థలాన్ని పక్కాగా సర్వే చేసి.. వాటి హద్దులను గుర్తించి.. విస్తీర్ణాలను డిజిటల్ రికార్డులో నమోదు చేయనున్నారు. అనంతరం ప్రతి ఇంటికి ఆస్తి కార్డులు జారీ చేయనున్నారు. దీంతో ఆధారాలు లేని ఆస్తులు, ఇళ్ల విలువ పెరగడంతో పాటు రుణాలు పొందేందుకు అవకాశం ఏర్పడుతుంది. త్వరలోనే సర్వే చేపట్టి డిసెంబరు నాటికి పూర్తి చేయనున్నట్లు సమాచారం.

పక్కాగా ఆస్తి పన్నులు..



నక్షా సర్వేతో ప్రభుత్వ ఆస్తులు, నాలాలు, నీటి వనరుల విస్తీర్ణాలతో పాటు ప్రైవేట్ ఆస్తుల లెక్క సైతం పక్కాగా నమోదయ్యే అవకాశం ఉంది. మరోవైపు ప్రైవేట్ ఆస్తుల హద్దులు సక్రమంగా నమోదు కావడం వల్ల అక్రమాలకు ఆస్కారం లేకుండా ఆస్తి పన్నులు పక్కాగా వసూలు చేసేందుకు అధికారులకు ఉపయోగపడనుంది. ప్రస్తుతం ఉన్న ఆస్తి మొత్తానికి కాకుండా కొంత మేర మాత్రమే ఆస్తి పన్నులు చెల్లిస్తుండడంతో పురపాలికకు నష్టం వాటిల్లుతుంది. దీనిని నివారించేందుకు భువన్ సర్వే చేపట్టినప్పటికీ అది అంత నడవక కొనసాగుతుంది. నక్షా సర్వే పూర్తయితే ఆస్తి పన్నుల సమస్యలతో సిబ్బందికి చిక్కులు తొలగనున్నాయి.

● నక్షా పథకంలో భాగంగా సర్వే చేపట్టిన అనంతరం ప్రభుత్వ భూములను గుర్తించి వాటికి హద్దులు నిర్ణయించనుండడంతో ఆక్రమణలకు అడ్డుకట్ట పడనుంది.

రైల్వేగేటు మూసివేత.. వాహనదారుల వెత



మూతపడిన రైల్వేగేటు

దామరచర్ల, న్యూస్‌టుడే: దామరచర్ల-వీర్లపాలెం రహదారిపై ఉన్న రైల్వేక్రాసింగ్ గేటు వద్ద మరమ్మతులు చేస్తుండటంతో శుక్రవారం రాకపోకలను నిలిపివేశారు. రైల్వేట్రాక్ పనుల కారణంగా వైటీపీఎస్‌తో పాటు టీవీగూడెం, వీర్లపాలెం, అడవిదేవులపల్లిలకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయంగా ఇర్కిగూడెం మెన్స్ మీదుగా మళ్లించారు. అదనంగా పదికిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి రావడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. రెండు రోజుల పాటు గేటు మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: అక్రమంగా పశువులను కబేలాలకు తరలిస్తున్న కంటైనర్‌ను సాగర్ పోలీసులు పట్టుకున్నారు. సాగర్ ఎస్సై సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. సాగర్ తిరుమలగిరి మండలం రంగుడ్ల ప్రాంతం నుంచి పశువులను కంటైనర్‌లో ఏపీ ప్రాంతంలోని కబేలాలకు అక్రమంగా రవాణా చేస్తుండగా గురువారం రాత్రి సాగర్ కొత్తవంతెన వద్ద ఉన్న చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేస్తుండగా వాటిని పట్టుకున్నట్లు తెలిపారు. పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న సాగర్ తిరుమలగిరి మండలం రంగుడ్ల చెందిన స్వామినాయక్ కేశవ్‌కు చెందిన షబ్బీర్ హుస్సేన్, జమీర్ ఖాన్, రాయలసీమ ప్రాంతానికి చెందిన రంజిత్‌నాయక్, రామచేంద్రనాయక్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రైతులకు పరిహారం అందేలా చూస్తా: జైవీర్‌రెడ్డి



గుంటకగూడెంలో నేలవాలిన పైరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జైవీర్

నిడమనూరు, న్యూస్‌టుడే: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయానికి, భారీ వర్షాల కారణంగా మండలంలో చాలా గ్రామాల్లో వరిపైరు నేలవాలి రైతులకు నష్టాన్ని కల్గించడం బాధాకరమని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో వందల ఎకరాల్లో వరి పైరు పూర్తిగా పరుపుమాదిరి పడిపోయింది. గుంటకగూడెంలో నేలవాలిన వరిపొలాలను ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. రైతులతో మాట్లాడి నష్టతీవ్రతను తెలుసుకున్నారు. దాదాపు 1,300 ఎకరాల వరకు పంటనష్టపోయినట్లు ఏవో మునికృష్ణయ్య ఎమ్మెల్యేకు తెలిపారు. పంట నష్టం గురించి వ్యవసాయశాఖ మంత్రి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు పరిహారం అందేలా కృషి చేస్తానన్నారు. నిడమనూరు వ్యవసాయమార్కెట్ ఛైర్మన్ సత్యం, వెంకటరెడ్డి, మట్టారెడ్డి, వెంకటరామణ, కృష్ణ, సైదయ్య, శివ, రామలింగయ్య పాల్గొన్నారు.

హాలియా: వర్షానికి పంట నష్టపోయిన రైతులకు అండగా ఉండి ఆదుకుంటామని అధైర్య పడవద్దని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అన్నారు. ఆయన మండలంలోని మదారిగూడెం గ్రామంలో ఇటీవల కురిసిన వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.

'అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?'

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: దేశంలోనే అతిపెద్ద యాదాద్రి థర్మల్ ప్లాంటును మిర్యాలగూడకు తెచ్చిన ఘనత మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావులదేనని దీన్ని మరచి అహంకారంతో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ మాట్లాడటం సరికాదని అడవిదేవులపల్లి మాజీ ఎంపీపీ బాలాజీనాయక్, హాతీరాంనాయక్ విమర్శించారు. స్థానికంగా భారాస కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకాల కోసం దిల్లీకి వెళ్లి అనుమతులు తెచ్చిన సమర్థుడు భాస్కర్‌రావు అని అన్నారు. అడవిదేవులపల్లి మండలంలో రూ. 16 కోట్లతో రహదారులు నిర్మించారన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని జాతీయ రహదారిని కుదించి అభివృద్ధికి విఘాతంగా ఎమ్మెల్యే బీఎల్ఆర్ మారారన్నారు. రవినాయక్, రవీందర్‌నాయక్, ప్రకాష్, శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించండి



విద్యార్థులకు ప్రోత్సాహక పతకాలు అందజేస్తున్న ఆర్సీవో సంధ్య, తదితరులు

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: గురుకుల సొసైటీ ద్వారా అందిస్తున్న అవకాశాలను విద్యార్థినులు సద్వినియోగించుకుని చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని రీజనల్ కో-ఆర్డినేటర్ సంధ్య అన్నారు. మండల పరిధిలోని శ్రీనివాసనగర్‌లోని దామరచర్ల గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా మహాత్మా జ్యోతిబాపులే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల సొసైటీ అండర్-17 జిల్లా స్థాయి క్రీడాపోటీలు శుక్రవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి రీజనల్ కో-ఆర్డినేటర్ సంధ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రతిభ చాటి గెలుపొందిన విద్యార్థినులకు ప్రోత్సాహక పతకాలు అందజేసి మాట్లాడారు. ఎంఈవో బాలునాయక్, ప్రిన్సిపల్ ఉమాదేవి, విశ్రాంత ప్రిన్సిపల్ నర్సింహారెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఉపాధ్యాయినీలు, పీడీ, పీఈటీలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చేయూత.. మహాత్మా జ్యోతిబాపులే తెలంగాణ బీసీ సంక్షేమ దామరచర్ల బాలికల పాఠశాల, కళాశాలకు గ్రామానికి చెందిన మాజీ సర్పంచి బోగవెల్లి వెంకటరమణ, బోగవెల్లి సునీత మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.2లక్షల విలువైన టేబుల్స్, కుర్చీలు, రాక్స్, రూ. లక్ష విలువైన స్టడీ మెటీరియల్ పుస్తకాలను శుక్రవారం అందజేశారు. అనంతరం దాత వెంకటరమణను రీజనల్ కో-ఆర్డినేటర్ సంధ్య, మండల విద్యాధికారి బాలునాయక్, ప్రిన్సిపల్ ఉమాదేవి, విశ్రాంత పిన్సిపల్ నర్సింహారెడ్డి, ఉపాధ్యాయినీలు శాలువతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

ఆకస్మిక తనిఖీ

త్రిపురారం, న్యూస్‌టుడే: మండలంలోని బెజ్జికల్ గ్రామాన్ని శుక్రవారం నల్గొండ ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి వందనం శ్రీదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్య పనులు, పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డు, శ్మశాన వాటిక, నాడెం కంపోస్ట్ ఎరువు యూనిట్‌ను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఎంపీడీవో విజయకుమారి, ఎంపీవో శ్యామల, పంచాయతీ కార్యదర్శి రాధిక, గ్రామ పంచాయతీ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు: ఆర్డీవో

చింతపల్లి: పత్తి రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఆర్డీవో శ్రీరాములు సూచించారు. శుక్రవారం మండల కేంద్ర సమీపంలోని పత్తి మిల్లును పరిశీలించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీసీఐ అధికారులు రైతులు తీసుకువచ్చే పత్తిని తప్పకుండా కొనుగోలు చేసి సకాలంలో బిల్లులు చెల్లించాలని కోరారు. రైతులు నాణ్యమైన పత్తిని తీసుకొస్తే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభిస్తుందన్నారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలని ధర్నా



మిర్యాలగూడ: ధర్నా చేస్తున్న ఏబీవీపీ విద్యార్థులు

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఉపకారవేతాలను విడుదల చేయాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం రాజీవ్ కూడలిలో విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి బొల్లేపల్లి మధుమోహన్‌రాజు మాట్లాడుతూ విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని రూ. 7,800 కోట్లు ఉపకార వేతనాలు, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయన్నారు. జిల్లా కన్వీనర్ సంపత్, మధు, ప్రణవి, అశ్విని, కీర్తి, సిరి, వంశీ, శ్రీకాంత్, మల్లేశ్వరి, శ్రీవిద్య, అభి, మధు తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరు: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిడమనూరు తహసీల్ కార్యాలయం ఎదుట పాఠశాల విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఉపకారవేతనాలను విడుదల చేయాలని కార్యాలయంలో ఉన్న సీనియర్ అసిస్టెంట్ రాజిరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు.

వేములపల్లి: భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ వేములపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ వేములపల్లి మండల కార్యదర్శి పుట్ట సంపత్ మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు కార్తీక్, నాయకులు శివమణి, సాయి, శంకర్, పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలతో పేద విద్యార్థులపై తీవ్ర భారం పడుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బుడిగ వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ.. తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డీటీ ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, ఉపాధ్యక్షుడు రాకేష్, మండలాధ్యక్షుడు జైచరణ్, శరత్, ఆంజనేయులు, ఇద్దిరాములు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

గ్రామాలను శుభ్రంగా ఉంచాలి



విద్యార్థులతో భోజన నాణ్యతను అడిగి తెలుసుకుంటున్న ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు

గుర్రంపోడు, న్యూస్‌టుడే: వీధుల్లో మురుగునీటి మడుగులు, చెత్త లేకుండా క్లీన్, గ్రీన్‌గా ఉంచాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా పౌరసరఫరాల అధికారి వి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం తేనేపల్లి, పిట్టలగూడెం గ్రామాల్లో ఆయన అంగన్వాడీలు, ప్రకృతివనాలు, వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డులు, పాఠశాలలు తనిఖీ చేశారు. పోచంపల్లి, ముల్కలపల్లి, పిట్టలగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. మైనారిటీ గురుకుల కళాశాలలో వసతులను, సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో మంజుల, ఏపీవో గోపాల్‌రెడ్డి, ఎంపీవో పద్మ, ఏవో మాధవరెడ్డి, డీటీసీఎస్ సైదులు గౌడ్, పీఆర్ ఏఈ శ్రీనివాసరావు ఉన్నారు.

పర్యటనలు చేసి.. రైతులకు సూచనలిచ్చి..



ముదిగొండలో గిరిజన సంప్రదాయ పద్ధతిలో బతుకమ్మ సంబరాల్లో శిక్షణ ఐఏఎస్‌లు

చింతపల్లి, పెద్దఅడిశర్లపల్లి, కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అందుతున్న ప్రజా సంక్షేమ పథకాల అమలు తీరును శిక్షణ ఐఏఎస్‌ల బృందం శుక్రవారం చింతపల్లి, పెద్ద అడిశర్లపల్లి, కొండమల్లేపల్లి మండలాల్లో పర్యటించింది. ఐదుగురు సభ్యులతో కూడిన బృందం గ్రామాల్లో తిరుగుతూ పథకాలు, గ్రామానికి సంబంధించి సమాచారం సేకరించారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని స్వయం ఉపాధి అవకాశాలు పొందుతున్న మహిళ ఇళ్లకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. వారి వెంట ఆయా మండలాల అధికారులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాల్లో శిక్షణ కలెక్టర్లు

దేవరకొండ: దేవరకొండ మండల పరిధిలోని ముదిగొండ గ్రామంలో శుక్రవారం శిక్షణ కలెక్టర్లు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి సౌకర్యాలను, పూర్వప్రాథమిక విద్య విధానాన్ని తెలుసుకున్నారు. పిల్లల ఆటవస్తువులను పరిశీలించారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ఆడిపాడారు. ఎంపీడీవో ఎస్‌డి డానియల్, ఏసీడీపీవో అనురాధ, సూపర్‌వైజర్లు చిట్టెమ్మ, రాధ, రేణుక, అంగన్వాడీ టీచర్లు తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

పాఠశాలల బలోపేతానికి కృషి.. డిండి: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేయాలని ఉపాధ్యాయుడు ముద్దాడ బాలరాజు అన్నారు. శుక్రవారం కొత్త తండాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మూతపడే స్థితిలో ఉందని, కాపాడుకోవాల్సిన బాధ్యత గ్రామస్థులపై ఉందని అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, ఉపాధ్యాయుడు అయోధ్య పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ.. హాలియా: భారాస అధినేత కేసీఆర్ పర్యవేక్షణలో పేద ప్రజలకు అండగా ఉంటామని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన హాలియాలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 23 మంది లబ్ధిదారులకు రూ.6,48,500 విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణి చేసి మాట్లాడారు. శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, సతీష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, పెద్దసైదులు, యాదయ్య, అంజద్ ఖాన్, హాలీ, ఖలీల్, దబ్బ శివాజి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత.. మాడ్గులపల్లి: మండలంలోని ఆగామోత్కూర్ పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మాడ్గులపల్లి పరిధిలోని గడ్డలదొరిగూడెం వద్ద పోలీసులు పట్టుకున్నారు. అనుమతులు లేకపోవటంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి, డ్రైవర్ బొల్లికొండ రామకృష్ణపై కేసునమోదు చేసినట్లు ఎస్సై కృష్ణయ్య తెలిపారు.

రక్తదాన శిబిరం నేడు.. మిర్యాలగూడ పట్టణం: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని మిర్యాలగూడలోని ఎంవీఆర్ కన్వెన్షన్‌లో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి.. వేములపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని మండల ప్రత్యేకాధికారి శ్రీనావాస్‌రావు పరిశీలించి మాట్లాడారు. కార్యదర్శి శ్రవణ్, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు రమణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీలు.. దామరచర్ల: మండలంలోని బొత్తలపాలెంలో మండల ప్రత్యేకాధికారి డీసీవో ప్రవీణ్‌నాయక్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలు, గ్రామసచివాయలంలో దస్త్రాలను పరిశీలించారు. ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఏపీవో నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి డి.చందర్, పల్లాశ్రీను తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి నాణ్యతపై శిక్షణ.. దామరచర్ల: తాగు నీటి ప్రాముఖ్యత, కలుషిత నీరు తాగటంతో కలిగే అనర్థాలపై గ్రామమంచి నీటి సహాయకుల శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా డీఈఈలు మొజాయిద్దీన్ అన్వర్, వెంకటరెడ్డి మాట్లాడుతూ మిషన్‌భగీరథ జలాల నాణ్యతతో ఉంటాయని ప్రజలకు వివరించాలన్నారు. ఏఈఈలు చీనానాయక్, సుస్మిత, సింధు, దినేష్‌కుమార్ తదితరులున్నారు.

మిరపతోట ధ్వంసం.. డిండి: మిరప పంటను ధ్వంసం చేసిన ఘటన మండలంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎర్రగుంటపల్లికి చెందిన కడారి పెద్దయ్య, కడారి వెంకటయ్యలకు రెండెకరాల చొప్పున వ్యవసాయ భూమి ఉంది. పెద్దయ్య ఎకరంలో పత్తి, మరో ఎకరంలో మిరపపంటలను సాగుచేయగా వెంకటయ్య రెండెకరాలు బీడుగా వదిలారు. తన భూమిలో మిరపపంట ఎలా సాగుచేస్తాడని వెంకటయ్య ట్రాక్టర్‌తో దున్ని ధ్వంసం చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

నర్సిరెడ్డిని గెలిపించాలని ప్రచారం.. చింతపల్లి: వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్ బలపర్చిన అల్గుబెల్లి నర్సిరెడ్డి గెలిపించాలని కోరుతూ.. శుక్రవారం మండలంలోని కుర్మపల్లితోపాటు పలు పాఠశాలల్లో ఆ సంఘం నాయకులు ప్రచారం నిర్వహించారు. కృష్ణారెడ్డి, కోట్ల యాదగిరి, ఆనంద్‌కుమార్, ఏడుకొండల్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి.. దామరచర్ల: అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటిరంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కేజేఆర్‌కాలనీ, దిలావర్‌పూర్‌లో వర్షాలకు నేలవాలిన వరిపైరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేలాది రూపాయలు వెచ్చించి పంట సాగుచేయగా చేతికందే సమయంలో నష్టం జరిగిందన్నారు. మల్లేష్, వినోద్‌నాయక్, శశిధర్‌రెడ్డి, కోటిరెడ్డి, దయానంద్ తదితరులున్నారు.

చర్యలు తీసుకోండి.. చింతపల్లి: మండలంలోని సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల నుంచి పత్తి కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పత్తి మిల్లు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని భాజపా మండల అధ్యక్షుడు శివర్ల రమేష్‌యాదవ్ జిల్లా ఎస్పీకి శుక్రవారం ఫిర్యాదు చేశారు. జంగయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

రాఘవ: దేవర, **వెంకటేశ్వర:** వెనమ్, **శ్రీనివాస:** లగ్గం,పొట్టేల్
విట్రోస్: దేవర, లగ్గం విశ్వం, వెనమ్, పొట్టేల్